సాక్షి
కామారెడ్డి

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



కోనాపూర్‌తో పేగుబంధం
సీఎం కేసీఆర్‌కు కోనాపూర్ గ్రామంతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన అమ్మ పుట్టిపెరిగింది ఇక్కడే..

- 10లో ▸



లక్కున్నోళ్లు
మద్యం దుకాణాలకు సోమవారం లక్కీడ్రా నిర్వహించారు. 11 మంది మహిళలకు షాప్‌లు దక్కాయి.

- 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
33.0 /22.3

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

కామారెడ్డి బరిలో.. దళపతి

- మిగతా మూడు చోట్ల సిట్టింగ్‌లకే మరో అవకాశం
- 'గంప'కు ఎమ్మెల్సీ ఇస్తారన్న ప్రచారం
- గులాబీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు
- కోనాపూర్‌లో మిన్నంటిన సంబురాలు

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల జాబితాను ప్రకటించడం ద్వారా సీఎం కేసీఆర్ ఎన్నికల సమర శంఖం పూరించారు. కామారెడ్డి జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలుండగా మూడుచోట్ల సిట్టింగ్‌లకే అవకాశమిచ్చారు. కామారెడ్డి నియోజకవర్గంనుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను తప్పించిన కేసీఆర్.. తానే స్వయంగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. కామారెడ్డి నుంచి సీఎం పోటీ చేస్తారన్న ప్రచారం కొంతకాలం జోరుగా సాగింది.

తానే సీఎంను ఆహ్వానించానని ఇటీవల గంప గోవర్ధన్ పేర్కొనడం ఈ ప్రచారానికి మరింత ఊతమిచ్చింది. ఎట్టకేలకు సోమవారం ప్రకటించిన జాబితాలో కామారెడ్డి నుంచి కేసీఆర్ పేరుండడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఆనందం అంబరాన్నంటింది. జాబితాలో బాన్సువాడ నుంచి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి నుంచి జాజాల సురేందర్, జుక్కల్ నుంచి హన్మంత్ సింధేల పేర్లున్నాయి. ఒక ఉప ఎన్నికతో కలిపి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన గంప గోవర్ధన్‌ను తప్పించిన సీఎం.. ప్రత్యామ్నాయ పదవి కట్టబెడతారన్న ఆశలో ఆయన అనుచరులున్నారు. ఎమ్మెల్సీ అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. కామారెడ్డినుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో నియోజకవర్గంతోపాటు జిల్లా మొత్తం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నారు. పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు.



అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదల కాకముందే బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. కామారెడ్డి నుంచి స్వయంగా సీఎం కేసీఆరే బరిలో దిగుతారన్న ప్రకటన ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచింది. బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికే మరోసారి అవకాశం ఇచ్చారు. జుక్కల్‌లో హన్మంత్ సింధే, ఎల్లారెడ్డిలో జాజాల సురేందర్ మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఐదు స్థానాల్లోనూ సిట్టింగ్‌లకే టికెట్లు దక్కాయి. బాల్కొండనుంచి మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్‌నుంచి జీవన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్‌నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్ నుంచి బిగాల గణేశ్ గుప్తా, బోధన్‌నుంచి షకీల్ అమేర్ బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా బరిలో నిలవనున్నారు. కాగా కామారెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను శాసనమండలికి పంపిస్తారన్న ప్రచారం జరుగుతోంది.

– సాక్షి, కామారెడ్డి

బాన్సువాడ నుంచి పెద్దాయనే..

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడనుంచి తన వారసుడిని బరిలో నిలుపుతారన్న ప్రచారం జరిగింది. అయితే మార్చి 1న బీర్కూర్‌లోని తెలంగాణ తిరుమల ఆలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న సీఎం కేసీఆర్.. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. తాను ఉన్నన్ని రోజులు శ్రీనన్న నా వెంటే ఉంటారని పేర్కొనడం ద్వారా స్పీకరే తిరిగి పోటీ చేస్తారన్న స్పష్టత ఇచ్చారు. దీంతో వారసులు పోటీ చేసే అంశం పక్కకు వెళ్లింది. సోమవారం విడుదల చేసిన జాబితాలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేరుంది. అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన వారు ఓడిపోతారన్న సెంటిమెంట్‌ను బద్దలు కొట్టేందుకు సీఎం కేసీఆర్ ఈసారి ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకున్నారని భావిస్తున్నారు. కామారెడ్డి నుంచి సీఎం స్వయంగా బరిలో నిలుస్తుండడంతో జిల్లాలోని ఆయా నియోజకవర్గాలపైనా ప్రభావం ఉంటుందన్న వ్యూహంగా భావిస్తున్నారు.

కామారెడ్డి

అభ్యర్థి: కల్వకుంట్ల చంద్రశేఖరరావు
పుట్టిన తేదీ: 17-2-1954
జీవిత భాగస్వామి: శోభ
సంతానం: తారక రామారావు, కవిత
రాజకీయ ప్రస్థానం: విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి ప్రవేశించారు.

- 1983 లో టీడీపీ నుంచి సిద్దిపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.
- 1985లో సిద్దిపేటనుంచే తొలిసారి శాసనసభకు ఎన్నికయ్యారు. 1989, 1994, 1999లలో గెలిచారు. పలు మంత్రివర్గాలలో మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు.
- 2001లో టీడీపీకి, ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేసి, టీఆర్‌ఎస్ స్థాపించారు. 2001(ఉప ఎన్నిక)లో గెలుపొందారు. 2004లో కరీంనగర్ ఎంపీగా గెలిచారు. కేంద్ర మంత్రిగానూ వ్యవహరించారు. తెలంగాణ కోసం రాజీనామా చేయడంతో 2006, 2008లలో వచ్చిన ఉప ఎన్నికల్లోనూ గెలిచారు. 2009లో మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు.
- 2014లో గజ్వేల్ నుంచి గెలిచి సీఎం అయ్యారు. 2018లోనూ ఆయన మరోసారి గెలిచారు.

జుక్కల్ బరిలో సింధే..

ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన జుక్కల్ నుంచి తిరిగి సిట్టింగ్ ఎమ్మెల్యే హన్మంత్ సింధేకే అవకాశం కల్పించారు. జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన నిరంతరం శ్రమించారన్న పేరుంది. ఆయన హయాంలో మారుమూల గ్రామాలకూ రోడ్లు వేశారు. సాగునీటి సమస్య పరిష్కారానికి నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారు. నాగమడుగు శంకుస్థాపన సమయంలో ఏర్పాటు చేసిన సభలో సింధేను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి కేటీఆర్ ప్రకటించడం ద్వారా ఆ రోజే ఆయనకు టికెట్టు కన్‌ఫర్మ్ చేశారు.

ఎల్లారెడ్డిలో జాజాలకే..

గత ఎన్నికలలో కాంగ్రెస్ టికెట్టుపై గెలిచి, ఆ తర్వాత గులాబీ కండువా కప్పుకున్న జాజాల సురేందర్‌కే మరోసారి ఎల్లారెడ్డి టికెట్టు దక్కింది. పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించడానికి సురేందర్ ప్రయత్నించారు. మంత్రి కేటీఆర్, మంత్రి హరీశ్‌రావులతో పాటు ఎమ్మెల్సీ కవితతో సన్నిహితంగా ఉంటూ నిధులు సాధిస్తున్నారు. ఇటీవల ఎల్లారెడ్డిలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ సురేందర్‌ను 70 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతో ఆయనకూ టికెట్టు ఖరారైనట్లేనని భావించారు. సోమవారం విడుదల చేసిన జాబితాలో సురేందర్ పేరుండడంతో ఆయన అనుచరుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

బాన్సువాడ



అభ్యర్థి పేరు: పరిగె(పోచారం) శ్రీనివాస్‌రెడ్డి
పుట్టినతేదీ: 10-02-1949
గ్రామం: పోచారం
మండలం: బాన్సువాడ
తల్లి పేరు: పరిగె పాపమ్మ
తండ్రి పేరు: పరిగె రాజిరెడ్డి
జీవిత భాగస్వామి: పుష్ప
సంతానం: ముగ్గురు కుమారులు, ఒక కూతురు
విద్యార్హతలు: బీఈ(ఎంటెక్)
రాజకీయ ప్రస్థానం: 1976లో రాజకీయాల్లో ప్రవేశం. 1977, 1981లలో దేశాయిపేట సొసైటీ చైర్మన్‌గా, 1987లో బుడ్మి సొసైటీ చైర్మన్‌గా ఎన్నిక. 1994, 1999, 2009, 2011(ఉప ఎన్నిక), 2014, 2019 లలో బాన్సువాడ ఎమ్మెల్యేగా ఎన్నిక. 2004 ఎన్నికలలో ఓటమి. 1998లో గృహనిర్మాణ, 1999లో భూగర్భ గనులు, 2000లో పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతల నిర్వహణ. 2014 నుంచి 2018 వరకు వ్యవసాయ మంత్రిగా పని చేశారు. 2019నుంచి అసెంబ్లీ స్పీకర్.

మూడోసారీ అధికారంలోకి వస్తాం..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధే మరోసారి మమ్మల్ని గెలిపిస్తాయి. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయం.

బాల్కొండ



అభ్యర్థి పేరు : వేముల ప్రశాంత్ రెడ్డి
గ్రామం:వేల్పూర్
మండలం : బాల్కొండ
తల్లిదండ్రులు : మంజుల, సురేందర్ రెడ్డి
సంతానం : కుమారుడు, కుమార్తె,
విద్యార్హత : బీఈ (సివిల్)
పుట్టిన తేది : 14-03-1966
రాజకీయ విశేషాలు : 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సమీప అభ్యర్థి సునీల్ రెడ్డిపై 32,408 ఓట్ల ఆధిక్యంతో గెలుపు. ప్రభుత్వంలో రోడ్లు, భవనాలు, గృహనిర్మాణ, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అనిల్‌కుమార్‌పై 36,248 ఓట్ల మెజార్టీతో విజయం. మిషన్ భగీరథ వైస్ చైర్మన్. మలేషియా, సింగపూర్, శ్రీలంక, థాయిలాండ్,యూఏఈ తదితర దేశాల సందర్శన.

జుక్కల్



అభ్యర్థి పేరు: హన్మంత్ సింధే
పుట్టినతేదీ: 14-8-1966
గ్రామం: దోస్‌గావ్
మండలం: జుక్కల్
తల్లి పేరు: నాగమ్మ
తండ్రి పేరు: మహదప్ప
జీవిత భాగస్వామి: శోభావతి
సంతానం: ముగ్గురు కుమారులు
విద్యార్హతలు: బీఈ(సివిల్)
నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగం.
రాజకీయ ప్రస్థానం: 2004లో రాజకీయాల్లోకి రాక. టీడీపీనుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009 లో టీడీపీ నుంచి పోటీ చేసి గెలుపు. 2013లో బీఆర్‌ఎస్‌లో చేరిక. 2014, 2018 లలోనూ విజయాలు.
శాసనసభ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ చైర్మన్‌గా, ప్యానెల్ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

మరింత సేవ చేస్తా..

జుక్కల్ నియోజకవర్గంనుంచి పోటీ చేసేందుకు నాలుగోసారి అవకాశం ఇచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. జిల్లానుంచి ముఖ్యమంత్రే స్వయంగా పోటీ చేస్తున్నందుకు గర్వంగా ఉంది. ఆయన అండదండలతో జుక్కల్ ప్రజానీకానికి మరింత సేవచేస్తా.

నిజామాబాద్ రూరల్



అభ్యర్థిపేరు : బాజిరెడ్డి గోవర్ధన్
గ్రామం : చీమన్‌పల్లి, సిరికొండ
తల్లిదండ్రులు : దిగంబర్, శాంతమ్మ
చదువు : బీఏ
పుట్టిన తేదీ : 17-02-1954
పదవులు..

- 1973లో పోలీస్ పటేల్, 1981లో సర్పంచ్. 1987-1990లో ఎంపీపీ. 1994-2004లో ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్. 1994లో ఆర్మూర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 1999-2004 వరకు ఆర్మూర్ ఎమ్మెల్యే. 2004-2009 వరకు బాన్సువాడ ఎమ్మెల్యే. 2014-2018 వరకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే. 2018 నుంచి రూరల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ చైర్మన్.

ఎల్లారెడ్డి



అభ్యర్థి: జాజాల సురేందర్
పుట్టినతేదీ: 25-03-1973
గ్రామం: నల్లమడుగు
మండలం: లింగంపేట
తల్లి పేరు: హనుమవ్వ
తండ్రి పేరు: నర్సయ్య
జీవిత భాగస్వామి: భార్గవి
సంతానం: ఇద్దరు కుమారులు
విద్యార్హతలు: బీకాం
రాజకీయ ప్రస్థానం: 2001లో టీఆర్‌ఎస్ ద్వారా రాజకీయ ప్రవేశం
2004లో టీఆర్‌ఎస్ టికెట్టు దక్కకపోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయారు.
2008, 2010 ఉప ఎన్నికలలో టీడీపీ నుంచి, 2014లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి. 2009లో పోటీకి దూరంగా ఉన్నారు.
2018లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి తొలిసారి గెలుపు. అనంతరం అధికార పార్టీలో చేరిక.

మరింత బాధ్యతతో వ్యవహరిస్తా..

ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఈ ప్రాంతాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళ్తున్నా. సీఎం కేసీఆర్ నాపై నమ్మకంతో మరోసారి అవకాశం ఇచ్చారు. ఆయనకు కృతజ్ఞతలు.

ఆర్మూర్



పేరు : ఆశన్నగారి జీవన్‌రెడ్డి
స్వస్థలం : జానకంపేట, వేల్పూర్
తల్లిదండ్రులు : రాజాబాయి, వెంకటరాజన్న
పుట్టిన తేదీ : 7-3-1976
విద్యాభ్యాసం : ఎల్ఎల్‌బీ
భార్య : రజితారెడ్డి
సంతానం : ఇద్దరు కూతుళ్లు
రాజకీయ నేపథ్యం : తెలంగాణ ఉద్యమంలో జీవన్‌రెడ్డి కీలక పాత్ర.

- ఎర్రజొన్న బకాయిల కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడుతున్న రైతులకు జీవన్ రెడ్డి బాసటగా నిలిచారు.
- 2014లో టీఆర్‌ఎస్ బీఫాంపై పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి కేతిరెడ్డి సురేశ్‌రెడ్డిపై గెలుపొందారు.
- 2018లో టీఆర్‌ఎస్ తరపున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆకుల లలితపై 28,795 ఓట్లతో రెండోసారి విజయం.
- పీయూసీ చైర్మన్‌గా నియామకం. తర్వాత టీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

నిజామాబాద్ అర్బన్



అభ్యర్థి : బిగాల గణేశ్ గుప్తా
పుట్టిన తేదీ : 17-4-1970
తల్లిదండ్రులు : సువర్ణమాల, కృష్ణమూర్తి గుప్తా,
భార్య : లత
సంతానం : ఇద్దరు కూతుర్లు
సోదరుడు: బిగాల మహేశ్
చదువు : బీఈ సివిల్
రాజకీయ ప్రవేశం: 2009లో నిజామాబాద్ ఎంపీగా టీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయారు.

- 2014లో అర్బన్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి తొలిసారి గెలుపొందారు.
- 2018లో అర్బన్ నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపు.

బోధన్



అభ్యర్థి : మహ్మద్ షకీల్
తల్లిదండ్రులు : షగుఫ్తా అదీబి, మహ్మద్ ఆజమ్, **భార్య :** అయేషా ఫాతిమా
నివాసం : బోధన్
పుట్టిన తేది : 7-03-1976
విద్యార్హతలు : డిగ్రీ
సంతానం : కొడుకు, 3 కుమార్తెలు
రాజకీయ నేపథ్యం : 2001లో బీజేపీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు.
ఆ తర్వాత టీడీపీలో చేరారు. 2007 టీడీపీ నుంచి ఎమ్మెల్సీకి పోటీ చేసి ఓటమి. 2009లో టీఆర్‌ఎస్‌లోకి చేరినప్పటికీ సుదర్శన్‌రెడ్డి చేతిలో ఓటమి. 2014, 2018లో ఎమ్మెల్యేగా గెలుపు. షకీల్‌కు నాలుగోసారి ఎమ్మెల్యేగా పోటీకి అవకాశం.

కోనాపూర్‌లో సంబురం..



కోనాపూర్‌లో సంబురాలు జరుపుకుంటున్న గ్రామస్తులు

బీబీపేట: సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయనుండడంతో ఆయన తల్లి స్వగ్రామం కోనాపూర్‌లో సంబురాలు జరుపుకున్నారు. గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు.

నాడు బ్రిగేడియర్‌గా కేసీఆర్

- నేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా..
- కామారెడ్డి ప్రాంతంపై సీఎం ఫోకస్
- అభివృద్ధికి బాటలు పడతాయని ఆశిస్తున్న జనం


ఉద్యమ సమయంలో విరాళాలు సేకరిస్తున్న కేసీఆర్(ఫైల్)

సాక్షి, కామారెడ్డి: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాన్ని మొదలుపెట్టిన తొలినాళ్లలో సీఎం కేసీఆర్ కామారెడ్డి ప్రాంతం మీద ఎక్కువ ఫోకస్ చేశారు. అప్పట్లో మండలానికో బ్రిగేడియర్‌ను నియమించి ఆ మండలంలో పూర్తి స్థాయిలో గులాబీ సైన్యాన్ని తయారు చేయడం, ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి యత్నించారు. అందులో భాగంగా కేసీఆర్ కామారెడ్డి బ్రిగేడియర్‌గా పనిచేశారు. ఇక్కడి కార్యకర్తలతో ఊరూరు తిరిగారు. రాష్ట్ర సాధనోద్యమంలో భాగంగా గర్జనల పేరుతో నిర్వహించిన బహిరంగ సభల కోసం డబ్బులు సమీకరించడానికి కూలీ పనులు చేశారు. ఆ సమయంలో ఉద్యమ నేతగా కేసీఆర్ కామారెడ్డిలో కార్యకర్తలతో కలిసి పలు దుకాణాల్లో పనిచేసి డబ్బులు సమీకరించారు. టీఆర్‌ఎస్ ఆవిర్భావం సమయంలో అప్పటి కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ముల తిర్మల్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు తెలంగాణ కోసం ఏకగ్రీవ తీర్మానం చేసి కరీంనగర్ సభకు హాజరయ్యారు. ఇక్కడి న్యాయవాదులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వైద్యులు.. ఇలా అన్ని వర్గాల వారు ఉద్యమానికి తమవంతు సాయం అందించారు. 2001లో వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో మెజారిటీ ఎంపీపీలను టీఆర్‌ఎస్ గెలుచుకుంది. అదే సమయంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని కైవసం చేసుకుంది. బ్రిగేడియర్‌గా పనిచేసిన కేసీఆర్‌కు నియోజకవర్గంలో దాదాపు ప్రతి ఊరి గురించి అవగాహన ఉంది. అలాగే చాలా మందిని పేరు పెట్టి పిలిచేంత పరిచయాలు ఉన్నాయి.

ఎమ్మెల్యే అభ్యర్థిగా..

ఉద్యమ నేతగా ఎన్నోసార్లు కామారెడ్డి నియోజకవర్గంలో తిరిగిన కేసీఆర్.. సీఎం అయ్యాక కూడా పలు సభల్లో పాల్గొన్నారు. 2021 జూన్ 20న కామారెడ్డి కలెక్టరేట్, జిల్లా పోలీసు భవనాలను ప్రారంభించారు. 2018 ఎన్నికల ప్రచార సభలో కామారెడ్డిలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇటీవలే కాలేజీ మంజూరైంది. త్వరలో తరగతులు కూడా ప్రారంభం కానున్నాయి. వచ్చే రెండుమూడు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయనుండడంతో ఈ ప్రాంత ప్రజల్లో ఎన్నో ఆశలు పెరిగాయి. సీఎం పోటీ చేస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి జరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

కేసీఆర్ పోటీ చేస్తుండడం అదృష్టం



సీఎం కేసీఆర్‌కు ఉద్యమ నాయకుడిగా కామారెడ్డి ప్రాంతంపై పూర్తి అవగాహన ఉంది. ఆయన కామారెడ్డి నుంచి పోటీ చేయడం ద్వారా అభివృద్ధికి బాటలు పడతాయి. సీఎం పోటీ చేయడం నియోజకవర్గ ప్రజల అదృష్టంగా భావిస్తున్నాం. అందరం కష్టపడి సీఎంను భారీ మెజారిటీతో గెలిపిస్తాం.

– కొమ్ముల తిర్మల్‌రెడ్డి, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్

ఏకగ్రీవంగా ఎన్నుకుందాం



సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీస్తుందని భావిస్తున్నాం. ఆయన భారీ మెజారిటీతో విజయం సాధిస్తారు. అభివృద్ధి కోసం ప్రతిపక్షాలు పోటీ నుంచి తప్పుకుని సీఎంను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు ముందుకు రావాలని కోరుతున్నాం.

– ఎంకే ముజీబొద్దీన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

భారీ మెజారిటీతో గెలిపిస్తాం



సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తారన్న ప్రకటనతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. సీఎంను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తాం. ఆయన వస్తే నియోజకవర్గంలో సాగునీటి సమస్యకు పరిష్కారం దొరకడంతో పాటు ఎంతో అభివృద్ధి జరుగుతుందని ఆశిస్తున్నాం.

– నిట్టు వేణుగోపాల్‌రావ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు

క్లుప్తంగా

28న నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ సిటీ: ఈ నెలా 28న మోర్తాడ్, కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం నస్రుల్లాబాద్‌లో నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీఎఫ్ సహాయ కమిషనర్ బి మధుసూదనచారి ఒక ప్రకటనలో తెలిపారు. మోర్తాడ్‌లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి శ్రవణ్‌కుమార్, నస్రుల్లాబాద్‌లో వెంకటసాయి విద్యానికేతన్‌లో ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి ఎస్ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో నిధి అప్కే నికట్ 2.0కు హాజరు కావాలని, ఫిర్యాదులు అక్కడికక్కడే పరిష్కరించబడుతాయని సహాయ కమిషనర్ తెలిపారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ చంద్రమోహన్



కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను తక్షణమే సంబంధిత అధికారులు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 37 దరఖాస్తులు వచ్చాయి. డీఆర్‌డీవో సాయన్న, ఏవో మసూర్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

మెప్మా పీడీగా రాజేందర్

నిజామాబాద్ నాగారం: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీగా రాజేందర్ కలెక్టరేట్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వేల్పూర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రాజేందర్ ఆర్డీవోగా ఉద్యోగోన్నతి పొందడంతో మెప్మా పీడీగా బాధ్యతలు చేపట్టారు. అధికారులు, ఉద్యోగులు పీడీకి శుభాకాంక్షలు తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు



తాడ్వాయి: తాడ్వాయిలో సోమవారం ఉదయం కారు చెట్టును ఢీకొంది. మండలంలోని చిట్యాలకు చెందిన కుమార్ కారులో కామారెడ్డి నుంచి వస్తుండగా అదుపుతప్పి తాడ్వాయి పాత బస్టాండ్ పక్కన చెట్టును ఢీకొంది. ప్రమాదంలో కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్: మర్కల్ సమీపంలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో కామర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాధిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 24న కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

రేషన్ షాపులను పర్యవేక్షించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: విజిలెన్స్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో రేషన్ షాపులను పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమ వారం జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. రేషన్ షాపుల ద్వారా ప్రజలకు బి య్యం సక్రమంగా అందేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు బాలామృతం అందేలా చూడాలన్నారు. లోపాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఎస్‌వో మల్లికార్జున బాబు, డీఆర్‌డీవో సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు చేపట్టడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలలో ప్యాడీ క్లీనర్‌లను అందుబాటులో ఉంచాలని, రైతులు శుభ్రం చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించేలా అవగాహన కల్పించాలని సూచించారు. సివిల్ సప్లయ్ డీఎం అభిషేక్ సింగ్, జిల్లా సహకార అధికారిణి వసంత, ఐకేపీ డీపీఎం రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా డ్రాఫ్ట్ విడుదల

- నాలుగు నియోజకవర్గాల్లో మహిళలే ఎక్కువ

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాల సవరణ, మార్పులు, చేర్పులతో పాటు డ్రాఫ్టలను విడుదల చేస్తోంది. అందులో భాగంగా రెండో విడతగా సోమవారం నియోజక వర్గాల వారీగా జాబితాలను విడుదల చేశారు. నాలుగు నియోజక వర్గాల్లోనూ మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి 8,28,152 మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళలు 4,26,739 మంది, పురుషులు 4,01,362, ఇతరులు 51 మంది ఉన్నారు.

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
జుక్కల్	94,988	97,061	10	1,92,059
బాన్సువాడ	89,793	97,668	08	1,87,469
ఎల్లారెడ్డి	1,03,166	1,10,846	03	2,14,015
కామారెడ్డి	1,13,415	1,21,164	30	2,34,609
మొత్తం	4,01,362	4,26,739	51	8,28,152

దళిత విద్యార్థినికి దక్కని న్యాయం


ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నిజామాబాద్‌అర్బన్: బీబీసీ పాఠశాల ఘటనలో దళిత విద్యార్థినికి న్యాయం జరగడం లేదు. పాఠశాలలో జరిగిన ఘటనకు సంబంధించి ఇటు విద్యాశాఖ, అటు పోలీస్‌శాఖ సరైన రీతిలో స్పందించడం లేదు. న్యాయం చేయాల్సిన అధికారులు గొడవ ఎందుకు సెటిల్‌మెంట్ చేసుకోవాలని చెబుతున్నారు. నాలుగు రోజుల క్రితం పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థినిని పాఠశాల చైర్మన్ ప్రవీణ్ ఫీజు కట్టలేదంటూ బైక్‌పై ఎంఈవో కార్యాలయానికి, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లారు. దారిమధ్యలో విద్యార్థినిని రెండు సార్లు కొట్టాడు. దీంతో విద్యార్థిని తల్లి అదే రోజు ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సోమవారం ఈ ఘటనకు సంబంధించి విద్యాశాఖ తరఫున శంకర్ అనే ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినిని ఎంఈవో కార్యాలయంలో విచారించారు. అనంతరం అక్కడే ఉన్న ఓ విద్యాధికారి ఈ గొడవ ఎందుకు, పాఠశాల యజమానితో సెటిల్‌మెంట్ చేసుకోవాలని బాధితురాలికి సూచించాడు. ఫీజు చెల్లించలేదని విద్యార్థినిని బయటకు తీసుకెళ్లిన పాఠశాల యజమానిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి సదరు విద్యాధికారి ఈ విధంగా మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది. మరో విద్యాధికారి విద్యార్థినిని యజమాని బయటకు తీసుకెళ్లడానికి కారణాలు ఉన్నాయని బాధిత కుటుంబంతో చెప్పినట్లు తెలిసింది. దీంతో విద్యాశాఖ అధికారులు పాఠశాల యజమానికే ఒత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో పోలీసులు సైతం సరైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. కేసు నమోదులో ఓ ఎమ్మెల్యే అనుచరుడు పాఠశాల యజమానికి మద్దతు పలుకుతు తప్పించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు బీబీసీ ఘటనలో విద్యార్థి సంఘాలు స్పందించడం లేదు.

దళిత సంఘాల నిరసన

బీబీసీ పాఠశాల ఎదుట పలు దళిత సంఘాల నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. పాఠశాల యజమానిపై చర్యలు తీసుకోవాలని, పాఠశాలపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లక్కున్నోళ్లు..!

- 48 వైన్ షాపులకు డ్రా
- డ్రా తీసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్


మద్యం దుకాణాలకు డ్రా తీస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్


డ్రా కోసం వచ్చిన దరఖాస్తుదారులు

సాక్షి, కామారెడ్డి: మద్యం దుకాణాల లక్కీ డ్రా సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ముగిసింది. 49 షాపులకు గాను ఒకదానికి తక్కువ దరఖాస్తులు రావడంతో 48 వైన్సులకు డ్రా తీశారు. రేణుకా ఫంక్షన్‌హాల్‌లో ఈ లాటరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 49 వైన్సులకు 2,174 మంది దరఖాస్తు చేసుకోగా ఆ పరిసర రోడ్లన్నీ బైకులు, కార్లతో కిక్కిరిసిపోయాయి. కాగా డ్రా తీసే చోట మద్యం సిండికేట్ రాయుళ్ల హడావుడి నెలకొంది. లాటరీ చేజిక్కించుకున్న వారు ఆనందంతో, రాని వారు నిరాశతో వెనుదిరిగారు.

విజేత నంబరు ప్రకటించడంలో తికమక..

సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన 13వ నంబరు మద్యం దుకాణానికి 45 మంది పోటీ పడ్డారు. కలెక్టర్ డ్రా తీసిన తరువాత ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ విజేత నంబరు ఒకదానికి బదులు మరొకరి పేర్కొన్నారు. వెంటనే తేరుకున్న అధికారులు పొరపాటు జరిగిందని చెప్పారు. ఒక్కసారిగా హాల్‌లో గందరగోళం నెలకొంది. కలెక్టర్ ఎక్సైజ్ అధికారిపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతీది వీడియో తీస్తున్నందున ఎలాంటి పొరపాట్లకు తావుండదని కలెక్టర్ పేర్కొనడంతో సద్దుమణిగింది.

సిండికేట్ రాయుళ్ల హడావుడి

మద్యం వ్యాపారాన్ని శాసిస్తున్న ఓ సిండికేట్‌కు చెందిన సభ్యులు హాల్‌లో హడావుడి చేశారు. కొన్ని దుకాణాలకు ఒక్క వ్యక్తే పది నుంచి ఇరవై నంబర్లకు చేయి లేపడాన్ని అందరూ చూస్తూ విస్తుపోయారు. అంతేగాక కొన్ని రిజర్వుడు షాపులకు బినామీలతో దరఖాస్తులు పెట్టించి అన్నీ తామై వ్యవహరించారు. మొత్తంగా హాల్‌లో సిండికేట్ రాయుళ్ల హవా కనిపించింది. సదరు సిండికేట్ సభ్యులకు డ్రాలో పదికి పైగా దుకాణాలు దక్కాయి.

మహిళలు దక్కించుకున్నవి పదకొండు..

మద్యం దుకాణాల టెండర్లలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తంగా 11 మందిని అదృష్టం వరించింది. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన మహిళలు తమ దుకాణానికి సంబంధించి సీరియల్ రాగానే ముందు వరుసలో నిల్చున్నారు. కొందరు పిల్లలతో కలిసి వచ్చారు. 2021–23లో కూడా 11 మంది మహిళలకు మద్యం షాపులు దక్కాయి. జిల్లా ఆబ్కారీ అధికారి రవీంద్ర రాజు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

తలవంచిన పేదరికం

- 'కిలిమంజారో' అధిరోహించిన నాళేశ్వర్ యువకుడు
- ఉద్యోగం చేస్తూనే పర్వతారోహణ


కిలిమంజారో పర్వతంపై త్రివర్ణ పతాకంతో ఆర్మూర్ మారుతి

నవీపేట: ఆ యువకుడి ఆత్మస్థైర్యం ముందు పేదరికం తలవంచింది. పర్వతారోహణపై మక్కువతో ఉద్యోగం చేస్తూనే లక్ష్యాన్ని చేరుకున్నాడు. మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన ఆర్మూర్ మారుతి కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. మారుతి తండ్రి చిన్నగంగారామ్ రైతు, తల్లి సరోజ బీడీకార్మికురాలు. పేద కుటుంబంలో నుంచి వచ్చిన మారుతి చిన్నతనం నుంచే చదువు లో చురుగ్గా ఉండేవాడు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 9.8 జీపీఏ సాధించాడు. దీంతో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. 2020లో చదువు పూర్తి చేసుకున్న మారుతి 2021 నవంబర్‌లో ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగం చేస్తూనే పర్వతారోహణపై మక్కువ పెంచుకున్నాడు. 2015లో ఎవరెస్ట్ అధిరోహించిన మలావత్ పూర్ణను స్ఫూర్తిగా తీసుకొని శిఖరాలు ఎక్కాలని నిర్ణయించుకున్నాడు. సెలవులు దొరికినప్పుడల్లా కొండలను ఎక్కుతూ మురిసిపో యాడు. రూ.5 వేల ఫీజు చెల్లించి భువనగిరి ఫోర్ట్‌లో బేసిక్ పరిజ్ఞానాన్ని పొందాడు. ట్రిపుల్ ఐటీలో సెలవులు వస్తే అందరు విద్యార్థులు సొంతూళ్లకు వెళ్తే మారుతి మాత్రం భువనగిరి వెళ్లేవాడు. కొడుకు జిజ్ఞాసను అర్థం చేసుకున్న తల్లిదండ్రులు ప్రో త్సహించారు. అక్కడ శిక్షణ పొందిన మారుతికి రెండేళ్ల క్రితం పశ్చిమ బెంగాల్‌లోని మౌంట్ రణాక్ పర్వతాలను అధిరోహించేందుకు అనుమతి వచ్చింది. అక్కడికి వెళ్లాలంటే కనీసం రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో నిరాశకు గురయ్యాడు. చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో ముందుకు వెళ్లలేదు.

అప్పు చేసి..

పర్వతారోహణే లక్ష్యంగా ఎంచుకున్న మారుతి ఆర్థిక భారాన్ని లెక్కచేయలేదు. ఈ క్రమంలో సౌత్ ఆఫ్రికాలోని కిలిమంజారో ఎక్కే అవకాశం వచ్చింది. ఈ సారి ఎలాగైన వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో అయిన వారి సహాయం కోరాడు. మారుతి తపనను అర్థం చేసుకున్న బంధుమిత్రులు రూ.4 లక్షల అప్పు ఇచ్చి ప్రోత్సహించారు. ఈ నెల 8న సౌత్ ఆఫ్రికా బయలుదేరిన మారుతి 10న పర్వతారోహణకు సిద్ధమయ్యాడు. 5895 మీటర్ల ఎత్తైన పర్వతంపైకి 15న చేరుకుని త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాడు.

బాలికకు పాముకాటు

చికిత్స కోసం సాయం కోరుతున్న తల్లిదండ్రులు


చాకలి లక్ష్మి(ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన చాకలి అలియాస్ కిచ్చమొల్ల లక్ష్మి పాముకాటుకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. లక్ష్మి ఇంట్లో నిద్రిస్తుండగా శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత వాంతులు చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గోపాల్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించి ఇంటికి తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం మళ్లీ అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు మళ్లీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. లక్ష్మి ఆరోగ్య పరిస్థితిని గమనించి ఆమె పాముకాటుకు గురైందని గుర్తించి వెంటనే మెదక్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం లక్ష్మి మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. బాలిక తల్లిదండ్రులు పోచయ్య, విజయ కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తారు. దీంతో వైద్యానికి డబ్బులు లేక దాతల సాయం కోరుతున్నారు. దాతలు స్పందించి తమ కూతురును ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం చేయాల్సిన వివరాలు..
9553795811(గూగుల్ పే)
కిచ్చమొల్ల రవికుమార్

మేనమామపై కత్తితో దాడి

భిక్కనూరు: మేనమామపై అల్లుడు దాడి చేసిన ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డిలో సోమవా రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంద శ్రీనివాస్ తన సోదరి మృతి చెందడంతో ఆమె కుమారుడు పోలు రాజును పెంచి పెద్దచేశాడు. వారం రోజులుగా రాజు అకారణంగా మేనమామ శ్రీనివాస్‌తో గొడవ పడుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి ముందు కూర్చున్న శ్రీనివాస్ వద్దకు రాజు వచ్చి స్థలం కాగితాలు ఇవ్వమని కత్తితో బెదిరించాడు. ఏ స్థలం ఏమి కాగితాలు అన్ని అడుగుతుండగానే కత్తితో శ్రీనివాస్ వీపు పై మూడు సార్లు పొడిచాడు. శ్రీనివాస్ కేకలు వేయడంతో రాజు పారిపోయాడు. స్థానికులు శ్రీనివాస్‌ను చి కిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

క్రైం కార్నర్

చెరువులో పడి ఒకరి మృతి


రాజు (ఫైల్)

పిట్లం: చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కంభాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రాజు(30)కి మూడు నెలల క్రితం పెళ్లి అయింది. రాజు ఆదివారం బ్రాహ్మణకుంట చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. కాగా సోమవారం చెరువులో రాజు మృతదేహం తేలింది. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు రాజు చెరువులో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: కామారెడ్డికి సమీపంలోని రంగంపేట గ్రామం వద్ద రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన మచ్చ రాజ్‌కుమార్ (30) కూలీ పని చేసుకునేవాడు. అతనికి రెండు సంవత్సరాల క్రితం భార్యతో విడాకులు అయ్యాయి. అప్పటినుంచి మద్యానికి బానిస అయ్యాడు. ఇంట్లోని కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడేవాడు. సోమవారం గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపారు.

కానిస్టేబుల్ ఇంట్లో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పరిధిలో రోటరీ నగర్‌లోని వివేకానందనగర్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ దత్తు ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. దత్తు 13న మహారాష్ట్ర వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా తులం బంగారం, 20 తులాల వెండి చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జూనియర్ అసిస్టెంట్‌లో ఇంట్లో..

నగరంలోని న్యాల్‌కల్ రోడ్ రోటరీ నగర్ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన హేమంత్ ఆర్మూర్‌లో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో ఆదివారం రాత్రి ఎల్లమ్మగుట్టకు వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చే సరికి ఇంటి తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. బీరువాలోని 25 తులాల బంగారు నగలు, 35 తులాల వెండి చోరీ అయినట్లు బాధితుడు తెలిపారు.

వివాహిత బలవన్మరణం

నస్రుల్లాబాద్: మండల కేంద్రానికి చెందిన ఎరుకలి యశోద(40) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యశోద ప్రతి రోజు ఇంట్లో గొడవ పడేది. ఈ క్రమంలో సోమవారం మద్యం మత్తులో భర్త, పిల్లలతో గొడవ పడి ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుంది. ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో భర్త ఎల్లయ్య తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరి వేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బోరు మోటారు చోరీ

లింగంపేట: లింగంపేటకు చెందిన లింగాల సాయిలు బోరు బావి నుంచి మోటారు, కేబుల్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. గ్రామ సమీపంలోని కట్టు కాలువ పక్కన పంట చేను వద్ద ఏర్పాటు చేసిన బోరుబావి నుంచి శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మోటారు విలువ రూ.18,000 ఉన్నట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

క్రైం రికార్డ్ బ్యూరోలు సమన్వయంతో పని చేయాలి

- కామారెడ్డి కానిస్టేబుల్ పనితీరు భేష్
- వీసీలో డీజీపీ అంజనీ కుమార్

కామారెడ్డి క్రైం: క్రైం డేటా నిర్వహణ విషయంలో ఎస్సీఆర్‌బీ(స్టేట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో)తో డీసీఆర్‌బీ (డిస్ట్రిక్ క్రైమ్ రికార్డ్ బ్యూరో) అధికారులు, సిబ్బందితో రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ తన కార్యాలయం నుంచి సోమవారం వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. అన్ని స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ఎస్సీఆర్‌బీకి డేటాను పంపించేటప్పుడు జిల్లాలకు చెందిన డీసీఆర్‌బీ అధికారులు మరోసారి సరి చూసుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయికి క్రైం వివరాలతో కూడిన డేటాను పంపడంలో కామారెడ్డి డీసీఆర్‌బీ విభాగం కానిస్టేబుల్ శ్రీకాంత్ రెడ్డి పని తీరును డీజీపీ అభినందించారు. త్వరలో ఆయనకు కమాండేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. వీసీ అనంతరం శ్రీకాంత్‌రెడ్డిని కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు అభినందించారు. వీసీలో అడిషనల్ ఎస్పీ నరసింహా రెడ్డి, డీఎస్పీ మదన్‌లాల్, సీఐ చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.